# కవిరాట్టు

[ఒక అభూత కల్పన]

కవి కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు; మూలుగుతున్నాడు; మెలికలు తిరిగి పోతున్నాడు.

ఏమిటంటే, కవికి అజీర్తి చేసిందన్నారు.

ప్రఖ్యాతి జాస్తిగా తిని అజీర్తి తెచ్చుకున్నాడు కవి.

ప్రఖ్యాతి అమితంగా తినరాదని కవికి వాళ్లమ్మ చెప్పలేదు! గబగబా మెక్కరాదనికూడా కవికి వాళ్ళమ్మ చెప్పలేదు.

వాళ్ళమ్మ చెప్పలేదు కనక, కవి ప్రఖ్యాతిదొరికే చోటికల్లా వెళ్ళి రెండుచేతులా అందిపుచ్చుకొని మరీ తిన్నాడు.

మర్యాదగా పిలిచి పీటవేసి కూర్చొబెట్టితేతప్ప ప్రఖ్యాతి తినటానికి వెళ్ళరాదని కవికి వాళ్ళమ్మ చెప్పలేదు. వాళ్లెంత పెడితే అంతే తినాలిగాని అడిగి పెట్టించుకోవటం మర్యాద కాదనికూడా కవికి వాళ్ళమ్మ చెప్పలేదు.

అందుచేత కవి అత్యాచారంగా ప్రతి ఇంట్లోనూ జొరబడి బలవంతాన అడిగి ప్రఖ్యాతి పెట్టించుకున్నాడు.

కొందరు నిర్లోభమోటంగా, "మాఇంట్లో ప్రఖ్యాతి లేదు, పో!" అని కవిని కసిరికొట్టారు.

మరికొందరు, "ప్రఖ్యాతిని మేము అడ్డమైన వాళ్ళకూ పెట్టం," అన్నారు.

"నువ్వు మాకేం పెట్టావని నీకుమేం ప్రఖ్యాతి పెడతాం?" అన్నారు ఇంకా కొందరు.

"మీ కేం కావాలంటే అదిఇస్తాను. నాకు మాత్రం ఇంత ప్రఖ్యాతి పెట్టండి!" అన్నాడు కవి.

"మాకు లంచం పెడతావా, దుర్మార్గుడా?" అన్నారు వాళ్లు. అంతేకాక వాళ్లు లోకంగారి ఇంటికిపోయి తలుపు తట్టి, "విన్నావా, లోకం? కవి మమ్మల్ని ప్రఖ్యాతి పెట్టమని అడిగాడు. మేం పెట్టంఅంటే లంచం ఇవ్వొచ్చాడు!" అని చెప్పివచ్చారు.

"చాలా చెడ్డకవి!" అని లోకం పెదిమవిరిచి మళ్ళీ తలుపేసుకుంది.

*　　*　　*

"నువు ప్రఖ్యాతి జాస్తిగా తిని అజీర్తి తెచ్చుకున్నావు!" అన్నారు కవితో కవిమిత్రులు.

"నా కజీర్తా? నాకా అజీర్తి!" అన్నాడు కవి తోక తొక్కినతాచల్లే లేస్తూ.

"నేను కడుపునిండా ప్రఖ్యాతి తిననేలేదు," అన్నాడు కవి.

"నేనింకా చాలా ప్రఖ్యాతి తిని హరాయించుకోగలను!" అన్నాడు కవి.

"నన్నసలు సగౌరవంగా పిలిచి తృప్తిగా ప్రఖ్యాతిపెట్టిన వెధవ ఎవడు?" అన్నాడు కవి.

(అట్లా అనరాదని కవికి వాళ్ళమ్మ చెప్పలేదు.)

"మరి నువ్వెందుకు మూలుగుతున్నావు — నీకు అజీర్తి చెయ్యకపోతే?" అన్నారు కవి మిత్రులు.

"ఎందుకట్లా మెలికలు తిరిగి పోతున్నావు?" అన్నారు కవి మిత్రులు.

"నేను మూలగటంలేదు, సంగీతం పాడుతున్నాను. మెలికలు తిరగటంలేదు, నృత్యం చేస్తున్నాను. కళలో కొత్తదనం మీరు తెలుసుకోలేరు. మీరు నన్నర్థంచేసుకోలేరు. మీరు నాస్నేహితులు కారు?" అన్నాడు కవి.

"మేము నీ స్నేహితులమే; నువ్వే మాస్నేహితుడివి కావు!" అని కవిమిత్రులు వెళ్లిపోయినారు.

* * *

ఒక సీసాలో విమర్శ పోసి కవిదగ్గిరికి తెచ్చాడు విమర్శక వైద్యుడు.

"చూడటానికింత అసహ్యంగా ఉంది. అదేమిటి?" అన్నాడు కవి.

"ఇది విమర్శ. దీన్ని తాగితే నీ అజీర్తి నెమ్మదిస్తుంది," అన్నాడు వైద్యుడు.

"నా కజీర్తి లేదు," అన్నాడు కవి.

"నేను వైద్యుణ్ణి. నన్ను మోసపుచ్చలేవు!" అన్నాడు విమర్శకుడు.

"మందు తీసుకునే అజీర్తి ఉంటుంది; మందు అవసరంలేని అజీర్తి ఉంటుంది. నాది మందు అవసరంలేని అజీర్తి. నీకీ సూక్ష్మాలు తెలియవు. నువు కవివికావు!" అన్నాడు కవి.

"ఏ అజీర్తిఅయినా లేకుండా ఉండటం మంచిది. నువ్వు కవివయితే అయినావు, వైద్యంకూడా తెలిసినట్టు నటించకు! నామాటవిని ఈమందు కాస్తపుచ్చుకో!" అన్నాడు వైద్యుడు.

కవి సీసాపుచ్చుకుని బిరడాతీసి వాసనచూశాడు. కవితల గిర్రున తిరిగిపోయింది. వాంతి అయినంతపని జరిగింది.

‘‘ఛీ, ఛీ! నా కీమందు వద్దు!’’ అన్నాడు కవి.

‘‘వద్దకపోతే మానుతుందా ఏమిటి? బలవంతాన అయినా ఇస్తాను. నన్నెట్లా ఆపగలవో చూస్తాను!’’ అన్నాడు వైద్యుడు.

మందు నోట్లో పడగానే కవికి పెద్దవాంతి అయింది. గిలగిలా తన్నుకున్నాడు కవి. అరిచాడు కవి. చిందులు తొక్కాడు కవి. విమర్శకుణ్ణి అడ్డమైన తిట్లూ తిట్టాడు కవి.

కాని కవికడుపు తాత్కాలికంగా ఖాళీ అయింది.

అట్లా కడుపుఖాళీకావటం ఆరోగ్యంగా తోచలేదు కవికి.

మళ్లీ దేశమంతా తిరిగి ప్రఖ్యాతి తినటం మొదలుపెట్టాడు కవి. మళ్ళీ కవిపొట్ట పూటయింది. అట్లా ఉంటేనే బాగుందనుకున్నాడు కవి.

విమర్శ సీసాలు ఏదుకాణంలో కనిపించినా హడలెత్తటం మొదలుపెట్టింది కవికి.

‘‘ఆసీసాలు నీకుకాదు. మరొకళ్ళకి!’’ అన్నప్పుడు కూడా ఆరాటం తగ్గలేదు కవికి.

‘‘పాపం అవి వాళ్ళకివ్వకండి. కవుల అజీర్తికి మందివ్వటం ధర్మంకాదు. అది కవితాకళకు అత్యాచారం!’’ అన్నాడు కవి.

* * *

వైద్యు లింకా తన వెంటపడుతూనే ఉండటం చూసి ‘‘నేనుకూడా వైద్యుణ్ణే!’’ అన్నాడు కవి.

తనకు వైద్యం తెలుసునని నిరూపించటానికి ఉపన్యాసాలివ్వసాగాడు కవి.

కవి కూడా వైద్యుడే నన్నారు! కవిత్వమూ, విమర్శా, రెండూ తెలియనివాళ్లు.

కవిఖ్యాతి జాస్తి అయింది. కవి కవిరాట్టయినాడు.

కవిత్వమూ విమర్శా తెలియనివాళ్లు కవిని కవిరాట్టు చేశారు.

కవి తనమందు సీసాలు చూపి, "నామందు చూడండి, ఎంత నేత్ర పర్వంగా ఉందో! దీనివాసన చూడండి, ఇందులో సువాసనద్రవ్యాలు కలిపాను. దీని రుచికూడా చాలా లేహ్యంగా ఉంటుంది...ఇదిబాధపెట్టకుండానే బాధనివారణ చేస్తుంది!" అన్నాడు.

చిన్నచిన్న కవికుమారులూ, పిల్లకవులూ కవిరాట్టును చుట్టుముట్టి, "మాకు మీమందు కావాలి?" అని ప్రాథేయ పడ్డారు.

అడగనివాడిది పాపంగా, కవిరాట్టు పిల్లకవు లందరికీ మందిచ్చాడు.

మందుతాగినవారంతా తమ అజీర్తి పోయిందనుకున్నారు కాని మందుమూలంగా చాలమందికి అజీర్తి పుట్టుకొచ్చింది.

"మే మంతా పిల్లకవులం కా మిప్పుడు. కవులమే!" అన్నారు వారు.

తాము కవులని చూపటానికి కవిరాట్టుగారి ప్రిస్క్రిప్షను కాగితాలు చూపారు.

ఆకాగితాలమీద ఉన్నమందు పిల్లకవులకని లేదు. కవుల కిచ్చేదనే ఉంది.